సాక్షి
నల్లగొండ

మంగళవారం ౹ 13 ౹ మే ౹ 2025



శాశ్వత పరిష్కారం వెతకాలి

టెర్రరిరాజాన్ని అంతమొందించేందుకు శాశ్వత పరిష్కారాన్ని వెతకాలని సీపీఐ జాతీ కార్యదర్శి నారాయణ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

14 నుంచి ఎంజీయూ పరిధిలో డిగ్రీ పరీక్షలు

నల్లగొండ టూటౌన్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 14 నుంచి డిగ్రీ సెమిస్టర్ 2, 4, 6 రెగ్యులర్, బ్యాక్‌లాగ్ 1, 3, 5 పరీక్షలు ప్రారంభమవుతున్నట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గతంలో తీసుకున్న హాల్‌టికెట్ లేదా నూతన హాల్‌టికెట్‌తో వచ్చినా పరీక్షలకు అనుమతిస్తారని తెలిపారు. కళాశాల గుర్తింపు కార్డు, ఏదైనా ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డుతో రావాలని పేర్కొన్నారు. పరీక్షల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రైవేట్ డిగ్రీ కాలేజీల సమ్మె విరమణ

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 40 రోజులుగా చేపట్టిన సమ్మెను సోమవారం విరమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి.. డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నట్లు పేర్కొన్నారు. సమ్మె విరమించడంతో యూనివర్సిటీ పరిధిలో పరీక్షలను ప్రారంభిస్తామని తెలిపారు. ప్రైవేట్ కళాశాలల విషయంలో సానుకూలంగా స్పందించిన ప్రభుత్వానికి, ఉన్నత విద్యామండలి కృతజ్ఞతలు తెలిపారు.

రహదారి వెంట విద్యుత్ కాంతులు

- సుందరీమణుల కోసం కాకుండా..

నిత్యం వెలిగేలా చూడాలంటున్న ప్రజలు

పెద్దవూర : బుద్ధపూర్ణిమ సందర్భంగా ప్రపంచ సుందరీమణులు ప్రపంచ పర్యాటక ప్రదేశమైన నాగార్జునసాగర్ బుద్ధవనం సందర్శనకు సోమవారం వచ్చారు. దీంతో అధికారులు హడావుడిగా మండల కేంద్రంలోని నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారి వెంట డివైడర్ల పొడవునా సుమారు రూ.25 వేల వ్యయంతో రకరకాల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్తాచెదారం, డివైడర్ల వెంట మొలిచిన పిచ్చిమొక్కలను పారిశుద్ధ్య కార్మికుల చేత తొలగింపజేశారు. డివైడర్ల వెంట ప్రధాన రహదారి మధ్యలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలకు మరమ్మతు చేసి వెలిగించారు. ప్రపంచ సుందరీమణులు వచ్చినప్పుడే కాకుండా నిత్యం ప్రధాన రహదారి వెంట శుభ్రం చేసి విద్యుద్దీపాలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది కదా అని మండల కేంద్రంలో ప్రజలు అంటున్నారు.



పెద్దవూరలో ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల అలంకరణ

సాగరతీరం.. అందగత్తెల విహారం











- నాగార్జునసాగర్‌కు మిస్‌వరల్డ్ పోటీదారులు
- గిరిజన సంప్రదాయ రీతిలో స్వాగతం
- విజయవిహార్‌లో ఫొటోషూట్‌తో సందడి
- బుద్ధుడి పాదాల చెంత పుష్పాంజలి
- మహాస్థూపంలో ధ్యానం
- బుద్ధ చరిత్ర నృత్య ప్రదర్శనను తిలకించిన ముద్దుగుమ్మలు

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ తీరంలో సోమవారం సుందరీమణులు విహరించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న మిస్‌వరల్డ్ -2025 పోటీలకు హాజరైన అందగత్తెలు.. నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో నిర్వహించిన బుద్ధజయంతికి హాజరయ్యారు. వీరు హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ విజయవిహార్ అతిథిగృహానికి చేరుకుని అక్కడ కాసేపు సేదదీరిన అనంతరం విజయవిహార్ వెనుకభాగంలో జలాశయతీరంలోని పార్కులో ఫొటోషూట్‌లో సందడి చేశారు. ఆ తర్వాత బుద్ధుడి పాదుకల వద్ద పుష్పాంజలి ఘటించి, పూజలు చేశారు. అక్కడినుంచి మహాస్థూపం వరకు నడిచి వెళ్లగా అక్కడ తెలంగాణ గిరిజన మహిళలు నృత్య ప్రదర్శనతో వారికి స్వాగతం పలికారు. మహాస్థూపం వద్ద శిల్పాల గురించి తెలుసుకున్నారు. మహాస్థూపంలో ధ్యానం చేశారు. ఫొటో ప్రదర్శన, బుద్ధుడి చరిత్రను తెలియజేసే నృత్య ప్రదర్శనను తిలకించారు. డిన్నర్ అనంతరం హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు.

బుద్ధపూర్ణిమ బౌద్ధులకు ఎంతో ప్రత్యేకం – కలెక్టర్ ఇలా త్రిపాఠి

బుద్ధపూర్ణిమ బౌద్ధులకు ఎంతో ప్రత్యేకమని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. బుద్ధపూర్ణిమ సందర్భంగా సాగర్ బుద్ధవనానికి హాజరైన ప్రపంచ సుందరీమణులకు బుద్ధ పూర్ణిమ గురించి ఆమె వివరించారు. బుద్ధపూర్ణిమను మీ అందరితో జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. బుద్ధుడు ప్రపంచానికి ప్రశాంత జీవన విధానాన్ని నేర్పించాడని పేర్కొన్నారు. తెలంగాణ గొప్పతనాన్ని ఇక్కడి సంస్కృతి సంప్రదాయాలను మీ మాతృదేశాలలో తెలియాజేయాలని సుందరీమణులను కోరారు. సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ మిస్‌వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యమివ్వడం గొప్ప విషయమన్నారు. ప్రపంచ బౌద్ధులంతా దర్శించుకునే విధంగా ఇక్కడ బుద్ధవనం నిర్మాణమైందన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నాగార్జునసాగర్‌తోపాటు బౌద్ధప్రదేశాల అభివృద్ధికి ప్రభుత్వం తగు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ సాగర్ ప్రాజెక్టు నిర్మాణంతోనే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, ఎస్పీ శరత్ చంద్రపవార్, ఐఏఎస్ అధికారి లక్ష్మి, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్, ఏఎస్పీలు రమేశ్, మౌనిక, ఆర్డీఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వెల్లంకి గెస్ట్‌హౌస్‌లో సేదదీరిన అందాల భామలు

చింతపల్లి : సుందరీమణులు చింతపల్లి మండల పరిధిలోని తీదేడు గ్రామ శివారులో గల వెల్లంకి గెస్టహౌస్‌లో సోమవారం సందడి చేశారు. వారు నాగార్జునసాగర్ వెళ్తూ మార్గమధ్యలో వెల్లంకి గెస్ట్ హౌస్‌లో 30 నిమిషాల పాటు సేదదీరారు. మిస్‌వరల్డ్ పోటీదారులు మండల కేంద్రం మీదుగా వెళ్తుండడంతో వారిని చూసేందుకు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు ఆసక్తి చూపారు. మాల్ వెంకటేశ్వరనగర్ నుంచి నాగార్జునసాగర్ వరకు పోలీసులు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు.



నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ అతిథి గృహం వద్ద ఫొటోషూట్‌లో పాల్గొన్న సుందరీమణులు



బుద్ధవనంలో ధ్యానం చేస్తున్న మిస్ వరల్డ్ పోటీదారులు

మట్టపల్లిలో వైభవంగా తిరుకల్యాణోత్సవం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణోత్సవాన్ని సోమవారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. అర్చకబృందం శ్రీస్వామి అమ్మవార్లకు జీలకర్రబెల్లం, యజ్ఞోపవీతం, తాళిబొట్టు,తలంబ్రాలను సమర్పించి నిండు వైశాఖ పౌర్ణమి వెన్నెలలో కల్యాణతంతు జరిపించారు. ఆదివారం అర్ధరాత్రి ఆలయం నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మిచెంచులక్ష్మి సమేత ఉత్సవమూర్తులను గజ, సింహ, అశ్వ వాహనాలపై అశేషభక్తుల జయజయధ్వానాల నడుమ కల్యాణమండపం వరకు ఊరేగింపుగా తరలించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని నిర్వహించారు. యాదగిరిగుట్ట దేవస్థానం నుంచి యాదాద్రి కలెక్టర్ మంత్రిప్రగడ హనుమంతరావు, ఆలయ ధర్మకర్త నరసింహమూర్తిలు తెచ్చిన పట్టువస్త్రాలను ఆలయ అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్‌లు శ్రీస్వామివారికి సమర్పించారు. కాగా ఉదయం ఆలయంలో పంచామృతాభిషేకం అనంతరం కల్యాణమూర్తులకు శ్రీమన్నారాయణమూర్తి అలంకారంలో గరుడవాహన సేవను నిర్వహించారు.



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు

అర్బన్ దరఖాస్తులు.. రూరల్ పరిధిలోకి!

- 1200 మంది రాజీవ్ యువవికాసం దరఖాస్తుల మార్పు
- ఎంపీడీఓ లాగిన్‌లోకి వెళ్లినట్లు నిర్ధారణ
- వాటిని మార్చకుంటే యువతకు రుణం రానట్టే..

నల్లగొండ టూటౌన్ : నిరుద్యోగ యువత ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు నీలగిరి మున్సిపాలిటీకి చెందినవి నల్లగొండ ఎంపీడీఓ లాగిన్‌లోకి వెళ్లాయి. నీలగిరి పట్టణానికి చెందిన 1200 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీలకు చెందిన దరఖాస్తులు నల్లగొండ రూరల్ పరిధిలోకి వెళ్లడంతో వారికి రుణాల మంజూరుపై నీలినీడలు కమ్ముకున్నాయి. నీలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డులకు చెందిన యువత రాజీవ్ యువ వికాసం పథకం కింద ఉపాధి కల్పన కోసం రుణం వస్తదనే ఆశతో దరఖాస్తులు చేసుకున్నారు. నీలగిరి మున్సిపల్ లాగిన్‌లో నమోదు చేసుకున్న వారు 5,626 మంది ఉన్నారు. ఎంపీడీఓ లాగిన్‌లో పడిన వారిని కలుపుకుంటే 6826 దరఖాస్తులు అవుతాయి.

ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు..

రాజీవ్ యువ వికాసం కింద రూ.50 వేలు అయితే బ్యాంకుతో సంబంధం లేకుండా కార్పొరేషన్ ద్వారా నేరుగా మున్సిపల్ కమిషనర్లకు పంపించి లబ్ధిదారులకు చెక్ రూపం ఇవ్వాలని నిర్ణయించారు. ఇది మంజూరైతే తిరిగి రూపాయి కూడా కట్టాల్సిన పనిలేదు. రూ.లక్ష దాటితే బ్యాంకు ద్వారా రుణాన్ని మంజూరు చేయాలని నిర్ణయించారు. అయితే రుణాల కోసం యువత మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంది. మీ సేవ కేంద్రాల్లో నమోదు చేసుకునే సమయంలో జరిగిన తప్పుల వల్ల వారి దరఖాస్తులు నల్లగొండ రూరల్ పరిధిలోకి వెళ్లిపోయారు. దీని కారణంగా 1200 మందికి రాజీవ్‌యువ వికాసం కింద రుణం మంజూరయ్యే అవకాశం లేదు. దీన్ని గుర్తించిన మున్సిపల్ సిబ్బంది వాటిని మున్సిపాలిటీకి బదిలీ చేయాలని ఎంపీడీఓ కార్యాలయ అధికారులను కోరినా వారి నుంచి స్పందన లేదు. ఇటు మున్సిపాలిటీ కానీ, అటు ఎంపీడీఓ కార్యాలయం అధికారులు గానీ దీని గురించి సీరియస్‌గా పట్టించుకోకపోవడంతో యువతకు రుణం మంజూరు కాకుండా పోయే ప్రమాదం ఉంది. ఈ విషయం చాలా మంది దరఖాస్తుదారులకు తెలియకపోవడంతో వారు రుణం వస్తదనే ఆశతోనే ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఎంపీడీఓ లాగిన్‌లోకి వెళ్లిన దరఖాస్తులను మున్సిపాలిటీ లాగిన్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.



నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేస్తున్న యువత (ఫైల్)

మున్సిపాలిటీ లాగిన్‌లోకి మార్పిస్తాం

నల్లగొండ పట్టణానికి చెందిన యువత దరఖాస్తులు నల్లగొండ ఎంపీడీఓ లాగిన్‌లోకి వెళ్లింది వాస్తవమే. ఎంపీడీఓతో మాట్లాడి వారి లాగిన్ నుంచి మున్సిపాలిటీ లాగిన్‌లోకి తీసుకువచ్చి అన్ని దరఖాస్తులను సమగ్రంగా పరిశీలిస్తాం.

– శ్రీనివాస్, మెప్మా టీఎంసీ

నకిలీ విత్తనాలపై నజర్

- జిల్లా, డివిజన్, మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు
- విత్తనాల అమ్మకంపై నిరంతరం నిఘా
- రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ సూచన



నల్లగొండ అగ్రికల్చర్ : నకిలీ పత్తి విత్తన అమ్మక వ్యాపారులపై జిల్లా యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. నకిలీ పత్తి విత్తనాల అమ్మకాలపై కట్టడి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇటీవల ఆదేశించారు. దీంతో జిల్లా యంత్రాంగం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. జిల్లా స్థాయిలో ఎస్పీ, వ్యవసాయ శాఖ అధికారి రెవెన్యూ అధికారి సభ్యులుగా డివిజన్ స్థాయిలో డీఎస్పీ, ఆర్డీఓ, ఏడీఏ సభ్యులుగా, మండల స్థాయిలో ఎస్ఐ, తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి సభ్యులుగా కమిటీలను నియమించింది. ఈ కమిటీలు నకిలీ విత్తనాల అమ్మకాలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి దాడులు నిర్వహించనున్నాయి. నకిలీ విత్తనాలు అమ్మిన, రవాణా చేసిన వారిపై కేసులను నమోదు చేసి చర్యలు తీసుకోనుంది.

గుట్టు చప్పుడు కాకుండా అమ్మకాలు..

జిల్లాలో కొన్ని సంవత్సరాలుగా నకిలీ పత్తి విత్తనాల అమ్మకాలు ముమ్మరంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. వాటి అమ్మకాలను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం ఏటా నిఘా పెట్టినా గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారులు తమ అమ్మకాలను మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. ఆ విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేసే రైతులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈసారి నకిలీ విత్తనాల ఆటకట్టించేలా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది.

విత్తన వ్యాపారుల అండదండలతో..

జిల్లాలోని ప్రధానంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన విత్తన వ్యాపారులు.. దళారులకు అండగా నిలిచి నకిలీ విత్తన వ్యాపారులకు మద్దతు పలుకుతున్నారని తెలుస్తోంది. ఆయా వ్యాపారులు తమ కంపెనీ బ్రాండెడ్ విత్తనాల అమ్మకం పేరుతో నకిలీ విత్తనాలను దళారుల ద్వారా రైతులకు అంటకట్టడంలో భాగస్వాములవుతున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న వ్యాపార సంస్థలే ఈ దందాలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

దళారులను నమ్మి మోసపోవద్దు



దళారుల మాటలు నమ్మి రైతులు రైతులు మోసపోవద్దు. 450 గ్రాముల బ్రాండెడ్ కంపెనీ విత్తన ధర రూ.901 మాత్రమే. దాని కన్నా ఎక్కువ ధర చెల్లించవద్దు. విత్తనాలు కొన్న వెంటనే రశీదు తీసుకోవాలి. ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే వ్యవసాయాదికారులకు సమాచారం అందించాలి.

– శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

బ్రాండెడ్ కవర్లలో నింపి..

గ్రామాల్లో ఎరువులు, విత్తనాల వ్యాపారులు ఏజెంట్లను నియమించుకుని నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. ప్రధానంగా దేవరకొండ, నల్లగొండ, మునుగోడు, గుర్రంపోడు, హాలియా తదితర మండలాల్లో ఈ దందా కొనసాగుతోంది. మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌నూరు, గద్వాల, ఏపీలోని గుంటూరు, పిడుగురాళ్ల, మాచర్ల తదితర ప్రాంతాల్లోని జిన్నింగ్ మిల్లుల నుంచి లూజ్ విత్తనాలు దళారులు కొనుగోలు చేసి వాటిని రంగురంగుల బ్రాండెడ్ కవర్లలో ప్యాక్ చేసి బ్రాండెడ్ విత్తనాల పేరుతో అమ్మకాలు సాగిస్తున్నారు. బ్రాండెడ్ కంపెనీలకు చెందిన జర్మినేషన్ లేని విత్తనాలను కూడా ఆ బ్రాండెడ్ కంపెనీ కవర్లలో ప్యాక్ చేసి రైతులకు అంటగడుతున్నారు. బీటీ 3, గ్లైసైల్ పత్తి విత్తనాలను ప్రభుత్వం నిషేధించినా.. ఆ విత్తనాలను కూడా రైతులకు అంటగడుతున్నారు.

యాదగిరిగుట్ట ముస్తాబు



విద్యుత్ లైట్ల వెలుగులు, నృసింహుడి చిత్రపటాలతో వైకుంఠద్వారం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి ఈనెల 15న సాయంత్రం మిస్ వరల్డ్ పోటీదారుల రాక నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా వైకుంఠ ద్వారం వద్ద విద్యుత్ లైట్లతో ఏర్పాటు చేసిన స్వామివారి చిత్రపటాలు, ఆర్చి కనువిందు చేస్తున్నాయి.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ACB నకిరేకల్ బ్రాంచి-20182, నల్గొండ జిల్లా-508211.

స్వాధీనత ప్రకటన (సింబాలిక్)

రూల్ 8(1) మరియు (2) క్రింద (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ACB నకిరేకల్ బ్రాంచి-20182** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12) తో చదువుకోవలసిన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: శ్రీ వెంకట రమణ దోనూరు, తండ్రి: రాజయ్య,** హెచ్.నెం.1-226/B, కట్టంగూర్, కట్టంగూర్ మండలం, నల్గొండ జిల్లా, **LOAN A/C. No. 39054912063** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయిసొమ్ము **ది.03.03.2025 నాటికి రూ.19,20,450.62 (అక్షరాల పంతొమ్మిది లక్షల ఇరవై వేల నాలుగు వందల యాభై రూపాయలు మరియు అరవై రెండు పైసలు మాత్రమే) + వడ్డీ, ఛార్జీలు మరియు వ్యయాలు** సదరు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.03-03-2025న డిమాండ్ నోటీసు జారీచేయబడినది.**

ఋణగ్రహీతలు / హామీదారులు మొత్తం బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలు / హామీదారులు మరియు సాధారణ ప్రజానీకమునకు నోటీసు ఇచ్చి, ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారము **ది.07-05-2025** న దిగువ పేర్కొన్న ఆస్తిని **స్వాధీనత తీసుకోవడమైనదని** ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయిసొమ్ము **ది.03.03.2025 నాటికి రూ.19,20,450.62 (అక్షరాల పంతొమ్మిది లక్షల ఇరవై వేల నాలుగు వందల యాభై రూపాయలు మరియు అరవై రెండు పైసలు మాత్రమే) + వడ్డీ, ఛార్జీలు మరియు వ్యయాలు** మొదవి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ACB నకిరేకల్ బ్రాంచి-20182** వారి ఛార్జికి లోబడి ఉండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత / హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

ఆస్తి యొక్క షెడ్యూలు

నకిరేకల్ యస్ఆర్ఓ నందు విక్రయ దస్తావేజు నెం.770/2020 ప్రకారము శ్రీ వెంకట రమణ దోనూరు, తండ్రి: రాజయ్య పేరుసగల ఆస్తి. నల్గొండ జిల్లా, నకిరేకల్ మండలం, నకిరేకల్ మునిసిపాలిటి, నకిరేకల్ గ్రామము, హెచ్.నెం.13-131, సర్వే నెం.361 నందు 250.0 చ॥గ॥ లేదా 209.06 చ॥మీ॥ విస్తీర్ణముగల స్థిరాస్తికి సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: ఉత్తరం:** 5-0 వెడల్పుగల రోడ్డు; **దక్షిణం:** 15-0 వెడల్పుగల రోడ్డు; **తూర్పు:** శ్రీ రాపోలు సాంబశివరావు యొక్క ఇల్లు; **పడమర :** పురం సోమయ్య యొక్క ఇల్లు.

తేది: 07-05-2025
ప్రదేశం: నకిరేకల్

సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాగర్‌లో అందాల భామలు


ప్రత్యేక ఎస్కార్ట్‌తో బస్సులో బుద్ధవనానికి వస్తున్న అందాల భామలు


గిరిజన సంప్రదాయంలో సుందరీమణులకు ఆహ్వానం పలుకుతున్న కళాకారులు


విజయవిహార్ రివర్ వ్యూ వద్ద అందాల భామలతో డీఐజీ, కలెక్టర్, ఎస్పీ, అధికారులు


మంగోలియాకు చెందిన అందాల భామ


బుద్ధుడి పాదుకలకు నివాళులర్పిస్తున్న అందాల భామలు


బుద్ధవనం ముందు ఫొటోలకు ఫోజులిస్తున్న సుందరీమణులు


బుద్ధుడి చరిత్రపై ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

క్లుప్తంగా

యాదగిరీశుడి సేవలో ఏపీ హైకోర్టు జడ్జి


యాదగిరీశుడిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ గుణరంజన్, కుటుంబ సభ్యులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ చల్లా గుణరంజన్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తుల చెంత ప్రత్యేక పూజలు చేశారు. జస్టిస్ గుణరంజన్‌కు అర్చకులు వేదాశీర్వచనం చేయగా, అధికారి రాజన్‌బాబు లడ్డూ ప్రసాదం అందజేశారు.

రాష్ట్ర సమాచార కమిషనర్‌గా తుర్కపల్లి వాసి


బోరెడ్డి అయోధ్యరెడ్డి

తుర్కపల్లి: రాష్ట్ర సమాచార కమిషనర్‌గా తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన బోరెడ్డి అయోధ్యరెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీపీఆర్‌ఓగా కొనసాగుతున్నారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆయన ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. 20 సంవత్సరాలు వివిధ దినపత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా, మీడియా కోఆర్డినేటర్‌గా పనిచేశారు. శాసనసభ ఎన్నికల సమయంలో వార్ రూం కన్వీనర్‌గా పనిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనను చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా(సీపీఆర్‌ఓ) నియమించి సీఎంఓలో అవకాశం కల్పించారు. తాజాగా రాష్ట్ర సమాచార కమిషనర్‌గా నియమించారు.

ఏఎస్‌టీసీ గౌరవ ఫెలోగా ఎంజీయూ వీసీ నియామకం


నియామకపత్రం అందుకుంటున్న ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్(ఏఎస్‌టీసీ)–హైదరాబాద్ గౌరవ ఫెలోగా మహాత్మాగాంధీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ నియమితులయ్యారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు నాగేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా గౌరవ ఫెలో నియామక పత్రాన్ని వీసీ అందుకున్నారు. తన నియామక ఎంజీయూకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొన్నారు.

చెరువులో పడి మహిళ మృతి

కోదాడరరూరల్ : కోదాడ పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన రామనర్సమ్మ(49) సోమవారం అనంతగిరి రోడ్డు వైపు పెద్ద చెరువులో పడి మృతిచెందింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆధ్యాత్మిక సర్క్యూట్..

సమ్మర్ స్పెషల్

ఆలయాలను చూసొద్దాం రండి

హైదరాబాద్‌కు చేరువలో యాదాద్రి జిల్లాలో అనేక ప్రసిద్ధమైన ఆలయాలు ఉన్నాయి. వేసవి సెలవుల్లో కుటుంబంతో కలిసి యాదగిరిగుట్ట నృసింహుడి దర్శనానికి వచ్చే భక్తులు ఈ ఆలయాలను సందర్శించవచ్చు.

యాదగిరిగుట్ట: హైదరాబాద్ నుంచి 60 కి.మీ. దూరంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఉంది. ఈ ఆలయానికి వచ్చే భక్తులకు ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 5 గంటలకు రూ.300 టిక్కెట్‌పై బ్రేక్ దర్శనం కల్పిస్తున్నారు. అంతేకాకుండా ధర్మ దర్శనంతో పాటు రూ.150 టిక్కెట్ కొనుగోలుపై వీఐపీ దర్శనానికి పంపిస్తారు. రాత్రి బస చేసేందుకు కొండపైన తెలంగాణ హరిత టూరిజంతో పాటు కొండ కింద దేవస్థానానికి చెందిన ప్రెసిడెన్షియల్ సూట్, తులసీ కాటేజీ, బస్టాండ్ సమీపంలో దేవస్థానం గదులు ఉన్నాయి. అంతేకాకుండా వివిధ కుల సంఘాలకు సంబంధించిన భవనాలు, ప్రైవేట్ గదులు అందుబాటులో ఉన్నాయి.


యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం

పసిడి కాంతులతో స్వర్ణగిరి దేవాలయం



యాదగిరిగుట్ట నుంచి 15 కిలోమీటర్ల దూరంలో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై భువనగిరిలో శ్రీస్వర్ణగిరి వేంకటేశ్వర ఆలయం ఉంది. ఈ మధ్య కాలంలో ఈ ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. యాదగిరీశుడిని దర్శించుకున్న భక్తులు తిరుగు ప్రయాణంలో స్వర్ణగిరి ఆలయాన్ని సందర్శించుకుని వెళ్తుంటారు. తిరుపతిని తలపించేలా ఈ ఆలయం ఉండడంతో తిరుపతికి వెళ్లలేని భక్తులు స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామిని దర్శించుకొని వెళ్తుంటారు. ఇక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం ఉంటుంది.

నాగిరెడ్డిపల్లిలో బంగారు శివలింగం


బంగారు శివుడు కొలువైన శివాలయం


ఈ ఆలయం భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉంది. ఇక్కడ పూర్తిగా బంగారంతో శివలింగాన్ని తయారు చేసి ప్రతిష్ఠించారు. యాదగిరిగుట్ట నుంచి ఈ ఆలయం 22 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

యాదగిరిగుట్టకు అనుబంధంగా పాతగుట్ట



యాదగిరీశుడి ఆలయం నుంచి 3కి.మీ. దూరంలో పూర్వగిరి(పాతగుట్ట) లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఉంది. యాదగిరిగుట్ట క్షేత్రం కంటే ముందు పూర్వగిరిలో స్వామి, అమ్మవార్లు వెలిశారని పురాణాలు చెబుతున్నాయి. క్రమక్రమంగా ఈ ప్రాంతమే పాతగుట్టగా మారింది. యాదగిరిగుట్ట నుంచి భక్తులు గుర్రం బండ్లపై ఈ ఆలయానికి వెళ్లేందుకు ఆసక్తి చూపుతారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న భక్తులు తప్పనిసరిగా పూర్వగిరీశుడిని దర్శించుకుంటారు.

సకల దేవతలకు నిలయం సురేంద్రపురి



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయం నుంచి 2 కిలోమీటర్ల దూరంలో సురేంద్రపురి పంచముఖ హనుమాన్ ఆలయం ఉంటుంది. ఇక్కడ భారీ ఎత్తులో పంచముఖ హనుమాన్, పంచ ముఖ శివుడి విగ్రహాలు ఉన్నాయి. అంతేకాకుండా ఇక్కడ వెంకటేశ్వరస్వామి ఆలయం సైతం ఉంటుంది. ప్రత్యేక టిక్కెట్ కొనుగోలు చేసి సురేంద్రపురిలో ఏర్పాటు చేసిన సకల దేవతలు కొలువైన మందిరాన్ని సందర్శించవచ్చు.

కొలనుపాక జైన్ మందిరం



యాదగిరిగుట్ట ఆలయానికి వచ్చిన భక్తులు ఆలేరు మండలం కొలనుపాకలోని జైన్ మందిరం, శ్రీసోమేశ్వర ఆలయాలను సందర్శించవచ్చు. యాదగిరిగుట్ట నుంచి కొలనుపాక 22 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడ జైన్ మందిరంతో పాటు సోమేశ్వర ఆలయం, వివిధ కుల సంఘాలకు సంబంధించిన మఠాలు సైతం ఉన్నాయి. జైన మందిరం, సోమేశ్వర ఆలయాలు నాటి కాకతీయులు, జైనులకు సంబంధించిన ఆనవాళ్లను గుర్తు చేస్తాయి.

వేములకొండ మత్స్యగిరి ఆలయం


వేములకొండ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం యాదగిరిగుట్ట నుంచి సుమారు 40 కిలోమీటర్లు ఉంటుంది. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి, సురేంద్రపురి, నాగిరెడ్డిపల్లిలోని శివాలయాన్ని సందర్శించిన భక్తులు వలిగొండ మీదుగా ఈ వేములకొండ ఆలయానికి చేరుకోవచ్చు. ఈ ఆలయంలోని కోనేరులో మీసాలతో కూడిన చేపలు దర్శనమిస్తాయి.

వెంకటపురం లక్ష్మీనరసింహస్వామి ఆలయం



యాదగిరిగుట్ట నుంచి కీసర, ఈసీఐఎల్ వెళ్లే మార్గంలో తుర్కపల్లి మండలం వెంకటపురంలో వెంకటగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం యాదగిరిగుట్ట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆలయ కొండ గుహల్లో స్వామివారు కొలువై ఉన్నారు. మెట్ల మార్గంలో ఈ ఆలయానికి చేరుకోవాల్సి ఉంటుంది.

రేపటి నుంచే డిగ్రీ పరీక్షలు

- ఉన్నత విద్యామండలి చైర్మన్ హామీతో సమ్మె విరమించిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాలు
- పరీక్షలకు హాజరుకానున్న 29,555 మంది విద్యార్థులు
- పాత హాల్‌టికెట్ ఉన్నా పరీక్షలకు అనుమతి


ఉన్నత విద్యా మండలి చైర్మన్‌తో ప్రైవేట్ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు

భువనగిరి: కొంతకాలంగా డిగ్రీ పరీక్షల నిర్వహణపై నెలకొన్న సందిగ్ధత వీడింది. ఉన్నత విద్యామండలి చైర్మన్‌తో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు జరిపిన చర్చలు ఫలించడంతో బుధవారం నుంచి డిగ్రీ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గత నెల 1వ తేదీ నుంచి జరగాల్సిన ప్రాక్టికల్స్, 11వ తేదీ నుంచి జరగాల్సిన డిగ్రీ పరీక్షలను ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు బహిష్కరించాయి. ఈ క్రమంలో మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. తిరిగి ఈ నెల 14వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించేందుకు ఎంజీయూ పరీక్షల విభాగం అధికారులు 6వ తేదీన షెడ్యూల్ విడుదల చేసి, హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. ఇదే సమయంలో మళ్లీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు విడుదల చేసే వరకు పరీక్షలను నిర్వహించబోమని తేల్చిచెప్పాయి. దీంతో మళ్లీ పరీక్షల నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. కాగా సోమవారం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్‌తో ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి చర్చలు జరిపారు. వారి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభంకానున్నాయి.

36 పరీక్ష కేంద్రాలు..

మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణ కోసం 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు 29,555 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో రెండో సెమిస్టర్ పరీక్షలకు 10,408, నాల్గో సెమిస్టర్‌కు 8,660, ఆరో సెమిస్టర్‌కు 8,447 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉన్నారు. వీరితో పాటు బ్యాక్‌లాగ్ విద్యార్థులు ఒకటవ సెమిస్టర్ పరీక్షలకు 6,066, మూడో సెమిస్టర్‌కు 5,109, ఐదో సెమిస్టర్‌కు 4,171 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

గతంలో పొందిన హాల్‌టికెట్లతో హాజరుకావచ్చు

ఈ పరీక్షలకు కొత్త హాల్‌టికెట్లతో పాటు గత నెల 11వ తేదీన పరీక్షలు జరగాల్సిన సమయంలో విడుదల చేసిన హాల్‌టికెట్లతోనూ హాజరుకావచ్చని ఎంజీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్ద కళాశాల గుర్తింపు కార్డు లేదా ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డులతో వస్తే అనుమతిస్తారని చెప్పారు.

ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు ధన్యవాదాలు

తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి మా సమస్యలను విన్నవించగా.. ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను విడుదల చేసే విషయంపై హామీ ఇచ్చారు. ఆయన హామీ మేరకు సమ్మె విరమించి పరీక్షల నిర్వహణకు సహకరిస్తామని చెప్పాం. సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన చైర్మన్‌కు ధన్యవాదాలు.

– సూర్యనారాయణరెడ్డి, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

టెర్రరిజం అంతానికి శాశ్వత పరిష్కారం వెతకాలి


పశ్య కన్నమ్మ సంతాప సభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, చిత్రంలో కూనంనేని సాంబశివరావు, శ్రీనివాస్‌రెడ్డి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హుజూర్‌నగర్ : టెర్రరిస్టులను అంతమొందించేందుకు ప్రపంచ దేశాలన్నీ కలసి శాశ్వత పరిష్కారం వెతకాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో జరిగిన స్వాతంత్య్ర సమరయోధురాలు పశ్య కన్నమ్మ సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. పహల్గాంలో అమాయకులను చంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, టెర్రరిస్టులు ఎప్పుడైనా ఆకస్మికంగా కాల్పులు జరపడం.. వెళ్లిపోవడమే చూశామని, మొదటిసారి మతప్రాతిపదికన చంపారని ఆయన అన్నారు. దేశంలో జరుగుతున్న టెరర్రిస్ట్ దాడులపై ప్రజలకు అనేక అనుమానాలు వస్తున్నాయని, దేశంలో ఎన్నికలు జరిగినప్పుడే టెరర్రిస్టులు దాడులు జరపడం అమాయకులు బలికావడం.. దానిని బీజేపీ వాడుకోవడం అనుమానాలకు తావిస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికా ఒకవైపు పాకిస్తాన్‌తో ఆర్థిక సంబంధాలు కొనసాగిస్తూనే,, మరోవైపు ఉగ్రవాద కార్యకలాపాలను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటిస్తుందని అన్నారు. పాకిస్తాన్‌లో ఉన్న ముస్లింలందరూ టెర్రరిస్టులు కాదని, అక్కడ కూడా టెర్రరిజాన్ని వ్యతిరేకించే సామాన్య ప్రజలు ఉన్నారని గుర్తుపెట్టుకోవాలని ఆయన సూచించారు. తీవ్రవాద సమస్యకు కేంద్రం శాశ్వత పరిష్కారం చేయడం బీజేపీకి ఇష్టం లేనట్లుంది అని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడు గొప్ప దార్శనికుడు

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు
- ఫణిగిరి బౌద్ధ క్షేత్రంలో బుద్ధ జయంతి


ఫణిగిరి మ్యూజియంలో బౌద్ధ సంపదను పరిశీలిస్తున్న చిరంజీవులు

నాగారం: ప్రపంచ మానవాళికి చక్కటి జీవన విధానాన్ని అందించిన గొప్ప దార్శనికుడు గౌతమ బుద్ధుడు అని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. సోమవారం రాత్రి నాగారం మండలంలోని ఫణిగిరి బౌద్ధక్షేత్రం వద్ద బోధిసత్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బుద్ధ జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బుద్ధుడి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫణిగిరి బౌద్ధక్షేత్రం ఒకప్పుడు ప్రపంచస్థాయి బౌద్ధ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లిందన్నారు. ప్రపంచ శాంతికి బుద్ధుడి బోధనలే మార్గమని అన్నారు. క్రీ.శ. 1వ శతాబ్దంలో ఫణిగిరి గ్రామం ధమ్మచక్రపురి పేరుతో బౌద్ధమతానికి నిలయంగా మారిందన్నారు. ఫణిగిరిలో లభించిన బౌద్ధ సందపను పరిరక్షించి, తెలంగాణ చారిత్రక వైభవాన్ని పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఫణిగిరి బౌద్ధక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగామార్చాలన్నారు. అనంతరం మ్యూజియంలోని బౌద్ధ సంపదను పరిశీలించి, మ్యూజియం వెలుపల బోధి వృక్షాన్ని నాటారు. కార్యక్రమంలో తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతినరేష్, బోధిసత్వ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులిగిళ్ల వీరమల్లుయాదవ్, టీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంపాల రాజేష్, వేణు, వినోద్‌రావు, ఆలకుంట్ల బాలకృష్ణ, కొత్తగట్టు మల్లయ్య, బొడ్డు నాగరాజు, అనిల్, మధు, పురావస్తుశాఖ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

- మద్యం తాగి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దే లారీ నిలిపివేత

అర్వపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు లోడు చేసుకొని మిల్లుకు తీసుకెళ్లకుండా మద్యం తాగి అక్కడే తిరుగుతున్న డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. చౌటుప్పల్‌కు చెందిన లారీ డ్రైవర్ బుడ్డ భాస్కర్ ఆదివారం జాజిరెడ్డిగూడెంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు లోడు చేసుకున్నాడు. నాగారంలోని రైస్ మిల్లులో ధాన్యాన్ని దిగుమతి చేయాల్సి ఉండగా సోమవారం మధ్యాహ్నం వరకు కూడా బయల్దేరకుండా కొనుగోలు కేంద్రం వద్దే లారీని ఉంచాడు. ఇదేమిటని ప్రశ్నించగా.. ఘర్షణకు దిగడంతో కొనుగోలు కేంద్రం నిర్వాహకురాలైన కుంభం వెంకటరమణ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక ఎస్ఐ బాలకృష్ణ కొనుగోలు కేంద్రం వద్దకు చేరుకుని లారీ డ్రైవర్ భాస్కర్‌కు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేయగా.. అతడు మద్యం తాగినట్లు తేలడంతో కేసు నమోదు చేశారు. అధికారులు మరో డ్రైవర్‌తో లారీని నాగారం రైస్ మిల్లుకు పంపించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మద్దిరాల: వ్యవసాయబావి వద్ద ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మద్దిరాల మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కుక్కడం గ్రామానికి చెందిన వెంకటవెల్లి రవి(50) కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా హైదరాబాద్ నుంచి స్వగ్రామం కుక్కడం వచ్చి తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తమ్ముడు వ్యవసాయ బావి వద్దకు వెళ్లేసరికి రవి విగతజీవిగా కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రవి ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఎం. వీరన్న తెలిపారు. మృతుడికి భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

మిర్యాలగూడ టౌన్: రహదారి దాటుతుండగా లారీ ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం మిర్యాలగూడ మండలంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం కంపాలపల్లి గ్రామానికి చెందిన నాగెళ్ల రాములు (80) చెన్నాయిపాలెంలో ఉంటున్న తన మనుమరాలి ఇంటికి వెళ్లేందుకు మిర్యాలగూడ మండలం తుంగపాడు వద్ద ఆటో దిగాడు. ఆటో దిగి జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారి దాటుతుండగా హాలియా నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాములును స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాగెళ్ల శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్.. యువకుడికి గాయాలు

చౌటుప్పల్ రూరల్: ట్రాక్టర్‌ను బైక్‌పై వెళ్తున్న యువకుడు ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ టన చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామానికి చెందిన కరంటోతు విజయ్ బైక్‌పై వలిగొండకు వెళ్లి వస్తుండగా.. మార్గమధ్యలో జైకేసారం గ్రామ పరిధిలోకి రాగానే ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో విజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన విజయ్‌ను చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

WANTED TEACHERS
Wanted experienced trained Teachers to teach IIT Maths, Physics, Chemistry, Biology, Primary, Pre-Primary and incharge.
Candidates willing to apply must have good communication skills and must be fluent in English. Interested Candidates can submit their resumes at our school.
Interview and Demonstration Date : 14th & 15th May, 2025
SRI ADITYA HIGH SCHOOL (EM)
Nursery to X
Aditya Nagar, Near New Collectorate, NALGONDA.
Cell : 89859 25612, 89859 25613

సాక్షి క్లాసిఫైడ్స్

Wanted
■ మేళ్లచెరువు మల్లారెడ్డిగూడెం ఏరియాలో అనుభవం గల సెక్యూరిటీ గార్డులు కావలెను. డ్యూటీ 12 గం॥, రూమ్ ఫ్రీ, జీతం రూ: 15,000/-. సంప్రదించండి ✆ 96401 41999, 77948 88452
SCA25003598
■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పు కావలెను. జీ: 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. Ph: 9347148051
[SCA25003526]

క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. :220/-
అదనపు లైనుకు రూ.: 50/-
: 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.